క్లుప్తంగా

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

గోదావరిఖని టౌన్: రామగుండం అసెంబ్లీ నియోజకవర్గంలో దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని ఆదివారం గోదావరిఖనికి వచ్చిన రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు దివ్యాంగుల నెట్‌వర్క్ రామగుండం అసెంబ్లీ ఇన్‌చార్జి పైడిపల్లి శ్రీనివాస్‌గౌడ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వ, పబ్లిక్, ప్రైవేటు సెక్టార్లలో 5శాతం ఉద్యోగాలు భర్తీ చేసేలా చూడాలన్నారు. ప్రతీ దివ్యాంగుడికి అంత్యోదయ కార్డు, రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించేలా చూడాలని విన్నవించారు. దివ్యాంగ ఉద్యోగులకు సంబంధించిన కార్యాలయాలు క్రింది ఫ్లోర్‌లోనే ఉండేలా, ర్యాంపులు ఉండేలా చూడాలన్నారు. సదరన్ సర్టిఫికెట్ కలిగి ఉన్న దివ్యాంగులందరికీ కొత్త పెన్షన్ విధానం అమలు అయ్యేలా చూడాలన్నారు.

గంగపుత్ర సంఘం పట్టణ అధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్


ప్రమాణ స్వీకారం చేస్తున్న పాలకవర్గం

సుల్తానాబాద్: సుల్తానాబాద్ గంగపుత్ర సంఘం పట్టణ అధ్యక్షుడిగా మాదరబోయిన రాజేంద్ర ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గంగపుత్ర సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా గరిగె బాలకిషన్, ప్రధాన కార్యదర్శిగా మైస వేణుగోపాల్, సహాయ కార్యదర్శిగా కుర్మ రఘుపతి, ప్రచార కార్యదర్శిగా పెద్దపల్లి శేఖర్, గౌరవ అధ్యక్షుడిగా కుర్మ మైసయ్య, సలహాదారులుగా గరిగె శ్రీనివాస్, పారుపల్లి గుణపతి, కుర్మకిషన్, సత్తయ్య, స్వామి, రాజేందర్ వ్యవహరించనున్నట్లు వారు ప్రకటించారు. సంఘం అభివృద్ధితోపాటు ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులకు కృషి చేస్తానని ఎన్నికైన రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన పలువురికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎలిగేడు ఎస్సైకి సన్మానం

ఎలిగేడు: మండలంలో నూతనంగా ప్రారంభించిన పోలీసుస్టేషన్‌కు మొదటి ఎస్సైగా వచ్చిన సత్యనారాయణను ఆదివారం బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు కప్పల ప్రవీణ్ ఆధ్వర్యంలో సన్మానించారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు రాకేశ్, మధు, జగన్, సుమన్, మధుకర్, నరేశ్, సతీశ్, వెంకటేశ్, ప్రవీణ్, మహేశ్, బీజేపీ నాయకుడు అడ్డగుంట తిరుపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


నగదు అందజేస్తున్న వీహెచ్‌ఆర్ సభ్యులు

గోదావరిఖనిటౌన్: స్థానిక తిరుమలనగర్‌కు చెందిన తాడూరి శ్రీనివాస్‌గౌడ్ అనారోగ్యంతో మరణించాడు. కుటుంబ పెద్ద మరణంతో ఇద్దరు కూతుళ్లతో తల్లికి ఇంటి పోషణ భారమైంది. విషయం తెలుసుకున్న వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వ్యాల్ల హరీశ్‌రెడ్డి రూ.10వేల నగదు ఫౌండేషన్ ఇన్‌చార్జి సిగిరి రాము ఆధ్వర్యంలో ఆదివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తిరుమల్, ప్రవీణ్, ఎర్రోజు కరుణాకర్, బొట్ల పోషం, యాదగిరి, బాలరాజు, సురేశ్, రవి పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్ ఆపాలి

గోదావరిఖని: ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపివేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఐ.కృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో ఆదివారం ఆయన పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 17న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్‌వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నాయకులు చంద్రశేఖర్, జూపాక శ్రీనివాస్, నరేశ్, సత్యనారాయణరెడ్డి, తోకల రమేశ్, రామకృష్ణ, రాజేషం, రామన్న పాల్గొన్నారు.

లబ్ధిదారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలి

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి రైతుభవన్‌లో సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. రైతు భరోసా లబ్ధి పొందుతున్న రైతులు పాల్గొనాలని అంతర్గాం మండల వ్యవసాయాధికారి కల్వల సతీశ్ కోరారు.

రోడ్డుపై గుంతలు.. వాహనదారుల తిప్పలు



కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ క్రాస్‌రోడ్‌లో ఆర్‌అండ్‌బీ రహదారిపై గుంతలు పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుగుండా చెరువు మట్టి, మానేరు ఇసుక లారీలు, టిప్పర్లు ఓవర్ లోడ్‌తో వెళ్లడంతో గుంతలు పడ్డాయి. గుంతలపై నుంచి వాహనాలు వెళ్లేటప్పుడు కుదుపులకు లోనై ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆటోలు, వాహనాలు మరమ్మతుకు గురవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. గుంతల్లో వర్షం నీరు నిలిచి వాహనాల వేగానికి బురద మీద పడుతోందని, గుంతలు పూడ్చివేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఓదెల మల్లన్న ఆలయ అభివృద్ధికి కృషి

- కార్మిక, ఉపాధి, గనులశాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి


మంత్రి వివేక్ వెంకటస్వామికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

ఓదెల: ప్రసిద్ధిగాంచిన ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తానని కార్మిక, ఉపాధి, గనుల శాఖమంత్రి వివేక్‌వెంకటస్వామి హామీ ఇచ్చారు. ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో మంత్రి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓదెల మల్లన్న తమ ఇంటి ఇలవేల్పు అని, తమ తండ్రి వెంకటస్వామి ఆశయాల మేరకు అభివృద్ధి చేస్తానన్నారు. భక్తుల కోసం అదనపు వసతి గదులు నిర్మిస్తామని, ఇందుకోసం స్థలం సేకరణ చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా మల్లికార్జునస్వామి, శ్రీసీతారామచంద్రస్వామి, నందీశ్వరులను మంత్రి దర్శనం చేసుకున్నారు. ఆలయ ఈవో సదయ్య ఆధ్వర్యంలో మంత్రికి మల్లికార్జునస్వామి జ్ఞాపిక అందజేశారు. పొత్కపల్లి సింగిల్‌విండో మాజీ చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అల్లం సతీశ్, పచ్చిమట్ల శ్రీనివాస్‌గౌడ్, గొస్కు రాజేశం, నోముల మాధవరెడ్డి, ఆవుల ముత్తయ్య పాల్గొన్నారు. అంతకుముందు కొలనూర్‌లో కాంగ్రెస్ నాయకులు దొడ్డె స్వామి, కుంచం మల్లయ్యల ఆధ్వర్యంలో మంత్రి వివేక్‌వెంకటస్వామికి ఘనంగా స్వాగతం పలికారు.

టెక్స్‌టైల్ భూముల్లో గుడిసె తొలగింపు



రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలోని టెక్స్‌టైల్‌శాఖకు చెందిన భూముల్లో అక్రమంగా శ్రీకోదండ రామాలయం ప్రాంగణ సమీపంలో గుడిసె వేసుకొని నివాసం ఉంటున్నాడు. కాగా సాక్షి దినపత్రికలో 'యథేచ్ఛగా భూకబ్జాలు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనంపై అతను స్పందించి సత్వరమే గుడిసె తొలగించి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దీనిపై బర్మా, శ్రీలంక, కాందీశీకుల సంఘం ప్రతినిధి జమ్ముల రామారావు సాక్షి యజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దపల్లిలో పీసీసీ ప్రధాన కార్యదర్శికి స్వాగతం


పెద్దపల్లిరూరల్: సన్మానిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రానికి వచ్చిన పీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీనుబాబును యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొంకూరి అవినాశ్ ఆధ్వర్యంలో ఆదివారం స్వాగతం పలికారు. అనంతరం ఆయనను సన్మానించారు. కాంగ్రెస్ నాయకులు నూగిల్ల మల్లయ్య, సయ్యద్ మస్రత్, బొడ్డుపల్లి శ్రీను, భూతగడ్డ సంపత్, జగదీశ్, యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రావణ్, జడల రాజు, రౌతు మనోజ్, క్రాంతివీర్, నాంసాని శ్రీనివాస్, తిరుమలేశ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

దారిపొడవునా వెల్లువెత్తిన అభిమానం

మంథని: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియామకమైన దుద్దిళ్ల శ్రీనుబాబు జిల్లాకు మొదటిసారిగా విచ్చేసిన సందర్భంగా పార్టీ శ్రేణులు, అభిమానులు స్వాగతం పలికారు. జిల్లా కేంద్రం నుంచి నియోజకవర్గంలోకి ప్రవేశించి కమాన్‌పూర్, రామగిరి, మండలాల మీదుగా ఆదివారం రాత్రి మంథనికి చేరుకున్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, నాయకులు శశిభూషణ్ కాచే, ముస్కుల సురేందర్‌రెడ్డి, అయిలి ప్రసాద్, వొడ్నాల శ్రీనివాస్ ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి

సుల్తానాబాద్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ నాయకులు సిద్ధం కావాలని పీసీసీ కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు పిలుపునిచ్చారు. పీసీసీ కార్యదర్శిగా ఎన్నికైన అనంతరం మొదటిసారి మంథని వెళ్తుండగా ఆదివారం కాంగ్రెస్ నాయకులు సుల్తానాబాద్‌లో ఆపి సన్మానించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అన్నయ్యగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ చైర్మన్ దామోదర్‌రావు, మాజీ సర్పంచు పుష్పలత, మాజీ ఎంపీటీసీ పల్ల సురేశ్, నాయకులు అమినొద్దీన్ పాల్గొన్నారు.

కమాన్‌పూర్ ఎక్స్‌రోడ్ వద్ద..

కమాన్‌పూర్: పీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులై మొదటిసారిగా మంథనికి వస్తుండగా కమాన్‌పూర్ ఎక్స్ రోడ్డు వద్ద ఆదివారం కాంగ్రెస్ నాయకులు శ్రీనుబాబుకు స్వాగతం పలికారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనను సన్మానించారు. వైనాల రాజు, పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు, కోలేటి మారుతి, భూంపెల్లి రాజయ్య, అన్వర్, పిల్లి శేఖర్, అంబీరు శ్రీనివాస్, ఇనగంటి రామారావు, పీట్ల గోపాల్, జెమినిగౌడ్, ఆకుల ఓదెలు, రంగు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తారుపల్లికి తాగునీటి సరఫరా పునరుద్ధరణ


మరమ్మతు చేస్తున్న సిబ్బంది

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని తారుపల్లిలో కొంతకాలంగా మానేరు నదిలో మంచినీటి సరఫరా బావి మోటారు పనిచేయక గ్రామస్తులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు ఎమ్మెల్యే విజయరమణారావుకు మొరపెట్టుకున్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆదివారం మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, నాయకులు సునీల్‌రావు తాగునీటి సరఫరా మోటారుకు మరమ్మతు చేయించారు.

ఉచిత శిక్షణ అభినందనీయం


సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి

రామగిరి: మండలంలోని కల్వచర్ల గ్రామంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ అందజేస్తున్న తిమ్మరాజు ఉషారాణి ప్రభాకర్ రావు దంపతుల సేవలు అభినందనీయమని ఉమ్మడి కమాన్‌పూర్ మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి అన్నారు. గ్రామంలో ఆద్య కంప్యూటర్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఏర్పాటు చేయగా ఆదివారం సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. మొదటి బ్యాచ్ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులు ఉపాధి పొందాలన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తిమ్మరాజు సంతోష్, టెక్నికల్ ట్రైనర్ నరహరి, వికాస్, చంద్రకాంత్, మేకల మారుతి పాల్గొన్నారు.

ఎన్టీపీసీ సీఎస్‌ఆర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ చైతన్యపురికాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం ఎన్టీపీసీ సీఎస్‌ఆర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సంపత్ రెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు నితిన్, డాక్టర్ వంశీ, డాక్టర్ అరుణ్, డాక్టర్ ధనంజయ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


కరీంనగర్: ఆత్మీయ సమ్మేళనంలో శ్రీవాణినికేతన్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు


రామగుండం: 1998–99 బ్యాచ్ విద్యార్థులు


ధర్మారం: 1990–91 బ్యాచ్.

కరీంనగర్: వారంతా బాల్య మిత్రులు.. 1990 నుంచి 2000 వరకు గోదావరిఖనిలోని శ్రీవాణినికేతన్ హైస్కూల్‌లో కలిసి చదువుకున్నారు. వీరు పదో తరగతి పూర్తిచేసి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం కరీంనగర్‌లోని తారక హోటల్ వేదికగా కలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. ఆటపాటలతో కాసేపు సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, వేణుగోపాల్, బి.రాజు, కుమార్, అనిత, పద్మ, కళావతి, అనిల్‌కుమార్.బి, రవి, రంజిత్ పాల్గొన్నారు.


రామగుండం: పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1998–99వ విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం హైస్కూల్ ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు బోధించిన అప్పటి ఉపాధ్యాయులు పసుపునూరి శంకరయ్యను సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థుల బృందం ఆటపాటలతో ఆనందంగా గడిపారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సహపంక్తి భోజనం చేశారు.

ధర్మారం: మండలంలోని పత్తిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 1990–91లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులందరూ ఒకేచోట చేరి రోజంతా సంతోషంగా గడిపారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమ నిర్వాహకులు ఇరుగురాల లక్ష్మణ్, కోయడ మధుకర్, గూడూరి లక్ష్మణ్, మెన్నేని రాంచందర్‌రావు, మల్లారెడ్డి, భాస్కర్, ఎండీ సలీం, అంజయ్య, ఈగం మునీందర్, మడ్డి రవి, అనసూర్య, జమున, జలజ, శంకరవ్వ, సువర్ణ, పద్మ పాల్గొన్నారు.

ఎన్టీపీసీ వైఖరిపై కార్మిక సంఘాల మండిపాటు

జ్యోతినగర్: ఎన్టీపీసీ యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులకు క్యారెక్టర్ సర్టిఫికెట్ పేరుతో మానసిక ఇబ్బందులకు గురిచేసే విధానాన్ని మానుకోవాలని కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. ఎన్టీపీసీ యాజమాన్యం గతంలో జారీ చేసినట్లుగా ఆరునెలల గేట్ పాస్ ఇవ్వకుండా 14రోజుల పాటు గేటు పాసులు జారీ చేస్తూ స్థానిక ప్రజా ప్రతినిధుల వద్ద నుంచి క్యారెక్టర్ (పీసీసీ) సర్టిఫికెట్ తీసుకురావాలని, లేదంటే కేవలం 14రోజుల గేట్ పాసు జారీ చేస్తామని కార్మికుల మనోధైర్యం కోల్పోయేలా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. గత ఒప్పందం ప్రకారం ఎలాంటి షరతులు లేకుండా కార్మికులకు ఆరునెలల గడువుతో గేట్ పాసు జారీ చేయాలని జేఏసీ కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపూర్‌లో గంగమ్మతల్లికి బోనాలు


రఘువీర్‌సింగ్‌ను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్‌లో గంగపుత్ర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ తల్లికి బోనాలతో పాటు, గంగపుత్రుల కుల దైవం గంగమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో గంగమ్మ తల్లికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఉత్సవాలలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ పాల్గొని అమ్మవార్లకు మొక్కులు చెల్లించారు. అనంతరం సంక్షేమ సంఘం సభ్యులు ఆయనను సన్మానించారు. గంగపుత్ర సంక్షేమ సంఘం సభ్యులు మాజీ సర్పంచ్ సత్యసాగర్, రాజేందర్, ఆనంద్, రవి, రాములు, మల్లేశ్ పాల్గొన్నారు.


కమాన్‌పూర్: మండల కేంద్రంలోని పెద్ద చెరువు కట్టపై ఇరువైపులా తుమ్మ చెట్లు పెరగడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కట్టపై నుంచి పంట పొలాలకు వెళ్లే రైతులు, గొర్రెల కాపరులు, మత్స్యకారులు తిప్పలు పడుతున్నారు. ఉపాధిహామీ పథకంలో కట్టపై పెరిగిన తుమ్మచెట్లను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

సింగరేణి అధికారుల పీఆర్‌పీ వెంటనే చెల్లించాలి


మాట్లాడుతున్న సీఎంఓఏఐ నాయకులు

గోదావరిఖని: సింగరేణి అధికారుల ఫెర్ఫార్మెన్స్ రిలేటెడ్ పేమెంట్(పీఆర్‌పీ) వెంటనే చెల్లించాలని సీఎంఓఏఐ అధ్యక్షుడు లక్ష్మిపతిగౌడ్ డిమాండ్ చేశారు. ఆర్జీ–2 ఏరియా ఎస్‌సీఓఏ క్లబ్‌లో ఆదివారం సీఎంఓఏఐ సింగరేణి బ్రాంచ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో అన్ని ఏరియాలకు చెందిన అధికారుల సంఘం నాయకులు హాజరయ్యారు. అధికారుల సమస్యలు చాలాకాలం నుంచి పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. కోలిండియాలో పీఆర్‌పీ అందజేస్తున్నప్పటికీ సింగరేణిలో మాత్రం కానరావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం స్పందించి వెంటనే పీఆర్‌పీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆర్జీ–2 ఉపాధ్యక్షుడు ఎం.రాముడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు పెద్ది నరసింహులు, పి.శ్రీనివాస్, రాజీవ్‌కుమార్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పట్టించుకోని ఏఐటీయూసీ



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ సింగరేణి కార్మికుల సమస్యలు పట్టించుకోకుండా గాలికి వదిలేసిందని హెచ్‌ఎంఎస్ యూనియన్ జనరల్ సెక్రటరీ రియాజ్ అహ్మద్ ఆరోపించారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్ కాలనీ హెచ్‌ఎంఎస్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుర్చీల కోసం కొట్లాడడం తప్ప వారు చేసిందేమీ లేదని విమర్శించారు. కార్మికుల మారుపేర్ల సమస్యపై మాట్లాడడం లేదన్నారు. సింగరేణిలో గతంలో కంటే ప్రస్తుతం రాజకీయ జోక్యం పెరిగిందన్నారు. కార్మికుల సమస్యలపై హెచ్‌ఎంఎస్ పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తుందని పేర్కొన్నారు. ఎండీ ఇస్మాయిల్, దావు రమేశ్, ఆయాజొద్దీన్, సందీప్, రవి, జవీద్ అక్రమ్ హుస్సేన్, రవి, అమరేందర్‌రెడ్డి, గౌస్‌పాషా, నరేశ్, జిజేందర్‌రెడ్డి, రాజు, వీరాయ్య పాల్గొన్నారు.

మహిళా కార్మికులకు అండగా ఐఎన్‌టీయూసీ


మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని: మహిళా కార్మికులకు అండగా ఐఎన్‌టీయూసీ నిలుస్తుందని యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ అన్నారు. స్థానిక సీఈఆర్ క్లబ్‌లో ఆదివారం రాత్రి యూనియన్ సింగరేణి మహిళా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సంస్థవ్యాప్తంగా ఉన్న 11ఏరియాలకు చెందిన మహిళలు హాజరయ్యారు. జనక్‌ప్రసాద్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో సింగరేణిలో మహిళా కార్మికుల సంఖ్య పెరుగుతుందన్నారు. యూనియన్ పదవుల్లో మహిళకు పెద్దపీట వేస్తామన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు నిర్వహించారు. యూనియన్ మహిళా అధ్యక్షురాలు ఎం.శేషరత్నం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, ధర్మపురి, వికాస్‌కుమార్, సదానందం, రాజేందర్, స్వప్నరెడ్డి, హేమరెడ్డి, శ్వేత, శారద, శ్రీమతిరెడ్డి, లలితశ్రీ, కల్పన, సుశీల పాల్గొన్నారు.

ధర్మారం లయన్స్‌క్లబ్ సేవలు హర్షణీయం


మెమొంటో అందుకుంటున్న రవీందర్‌శెట్టి

ధర్మారం: సేవా కార్యక్రమాల్లో ధర్మారం లయన్స్ క్లబ్ ముందు వరుసలో ఉండటంతో పాటు ఇంటర్నేషనల్ స్థాయిలో ప్రశంస పత్రాలు అందుకోవడం హర్షణీయమని ఉమ్మడి జిల్లా గవర్నర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని ఎర్రగుంటపల్లిలోని మహేశ్వర ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ధర్మారం, దొంగతుర్తి లయన్స్‌క్లబ్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా జిల్లా గవర్నర్ వెంకటేశ్వర్‌రావు హాజరై ప్రమాణ స్వీకారం చేయించారు. గత ఏడాది లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా కొనసాగిన తలమక్కి రవీందర్‌శెట్టి ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేశారన్నారు. రవీందర్‌శెట్టిని ఆదర్శంగా తీసుకుని ప్రస్తుత అధ్యక్షుడు మల్లేశం మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు. రీజియన్ చైర్మన్ రాజేందర్, జిల్లా కేబినెట్ కార్యదర్శి కృష్ణ కిశోర్, అడ్మిన్ కార్యదర్శి సామ ఎల్లారెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ ఇనుగుర్తి రమేశ్, మిట్టపల్లి ప్రవీణ్, రీజినల్ చైర్మన్ కామని శ్రీనివాస్, జోన్ చైర్మన్ మునీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముత్తారంలో ఉచిత వైద్య శిబిరం

ముత్తారం: ముత్తారంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో చంద్రుపట్ల అనసూయమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెనె హాస్పిటల్ వైద్యులు ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ లక్ష్మీనారాయణ, బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతలు రైతువేదికకు రావాలి

జూలపల్లి: మండలంలోని అబ్బాపూర్‌లో ఉన్న రైతు వేదిక వద్దకు క్లస్టర్ రైతులు మధ్యాహ్నం 3 గంటలకు రావాలని మండల వ్యవసాయాధికారి ప్రత్యూష కోరారు.